# ఆకలి

**కళ్ళకు కనిపించే రూపురేఖలు, వేషభాషలను బట్టే తప్ప కనిపించని మానసిక ఔన్నత్యాన్ని బట్టి మనిషిని గౌరవించని ఈ యాంత్రిక ప్రపంచంలో ఆ వ్యక్తికి కనువిప్పు కలిగించినదేమిటి?**

ఆకలి రుచెరుగదు" అంటారు గానీ, 'తరతరాలుగా తరలివస్తున్న తరగని తారతమ్యాలు కూడా ఎరుగదు ఒక్కోసారి' అన్న విషయం నేను పుట్టిన ఇరవై తొమ్మిది సంవత్సరాలకి నాకు అనుభవంలోకి వచ్చింది.

ఎప్పటినుంచో ఎదురు తెన్నులు చూస్తున్న ప్రమోషన్ రానే వచ్చింది. ఇంకేం... ఏడుకొండల వాడితో చేసుకున్న ఒప్పందం ప్రకారం తలనీలాలు సమర్పించి, దర్శనం చేసుకొందాం అని శనివారం రాత్రి ట్రెయిన్‌కి ప్రయాణం కట్టాను. "పూరీలు చేశాను. నాలుగు తినేసి వెళ్ళండి" అంటూ శ్రీమతి ఎంత మొత్తుకుంటున్నా వినకుండా, "బండికి టైమయిపోతోంది" అంటూ ఆటో ఎక్కేసి స్టేషన్‌లోకొచ్చిపడ్డాను.

అలసిపోయిన బాటసారిలా నెమ్మదిగా వచ్చి ఆగింది ట్రెయిన్ గుడివాడ స్టేషన్‌లో. జేబులోంచి టికెట్ ఒకసారి తీసి కంపార్టుమెంటు నంబరు, బెర్తు నంబరు చెక్ చేసుకుని నాకు ఎలాట్ చేసిన సీటులో కూర్చున్నా.

ఆదరాబాదరాగా ఆఘమేఘాల మీద స్టేషన్‌కి పరుగెత్తుకువచ్చానేమో సీట్లో కూర్చున్నాక ప్రాణం కుదుటపడి ఎంతో హాయనిపించింది. 'ఏదైనా టిఫిన్ కొనుక్కుంటే బాగుణ్ణు' అన్న ఆలోచన మనసులోకి వచ్చింది కానీ, అది ఆచరణలోకి పెట్టేలోపలే బండి కదిలింది. 'విజయ వాడలో కొనుక్కోవచ్చులే ఏదో ఒకటి' అనుకుంటూ ఎదుటి సీట్లో కూర్చున్నవాళ్ళ వైపు పరిశీలనగా చూశా. ఎవరో ఒక ఆసామి, అతని భార్య, వాళ్ళ ముగ్గురు పిల్లలతో ఒకటే గలబాగా ఉంది. పిల్లలు పై బెర్తుపైకి ఎక్కడం, మళ్ళీ దిగడం, మధ్యమధ్యలో కొట్టుకోవడం, తిట్టుకోవడం, గట్టిగా ఏడవడం, మళ్ళీ కాసేపటికి అంతా మర్చిపోయి ఆడు కోవడం- అలా వాళ్ళ ప్రపంచంలో వాళ్ళు పూర్తిగా నిమగ్నమై పోయారు. కాసేపయ్యాక అరిటాకులు పరచుకుని, తెచ్చుకున్న పదార్థాలు నింపుకొని తినడంలో లీనమైపోయారు. ఆహారపదార్థాలు సీట్లపైన ఇంత, కింద ఇంత పడేస్తూ, నీళ్ళు ఒలకబోస్తూ, ఇంతింత ముద్దలు చేసుకుని మింగుతూ, వాళ్ళు తింటున్న తీరుకి నాకైతే కడుపులో దేవినట్లయింది, ఒళ్ళూ మండింది.

'పట్టి పల్లెటూరి గబ్బిలాయిలు, పొలాల్లో మట్టి పిసుక్కునే రకాలు! వీళ్ళకి తోడు రిజర్వ్డు కంపార్టుమెంటు కావాల్సివచ్చింది కాబోలు. జనరల్‌లో కూలబడకూడదూ' అని తిట్టుకున్నా మనసులో.

'భలేవాడివే... వాళ్ళ డబ్బు పెట్టుకుని వాళ్ళు టికెట్టు కొనుక్కుంటే మధ్యలో నీదేం పోయింది?' అని వివేకం హెచ్చరిస్తూంటే, 'వీళ్ళ ఊసు నాకెందుకులే? ఉదయం లేస్తూనే వాళ్ళ దారి వాళ్ళది, నా దారి నాదీన్నూ' అని సరిపెట్టుకొని కిటికీ గుండా పొలాలపై ఎగురుతున్న మిణుగురు పురుగుల కాంతిని చూస్తూ కూర్చున్నా. తిండి ప్రహసనం అవుతూనే పిల్లలు మూడు బెర్తులు ఆక్రమించుకుని నిద్రకు ఉపక్రమించారు. ఆ రైతు, అతని భార్య నా పక్కన వచ్చి కూర్చొని ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో విజయవాడ స్టేషను రానే వచ్చింది. పిల్లలు సృష్టించిన కిష్కింధకాండ, రకరకాల తిండి వాసనలు, బీడీ పొగ- అవన్నీ మనసులో ఇంకా తిష్టవేసుకుని ఉండడంతో ఆకలి చచ్చిపోయి ఏం కొనుక్కో బుద్ధి పుట్టలా! ఏం తినాలనీ అనిపించలా! బండి దిగి నాలుగు దోసిళ్ళ నీళ్ళు తాగి, కాసేపు అటూ ఇటూ పచార్లు చేసి కంపార్టుమెంటులోకి వచ్చి, బుద్ధిగా పై బెర్తుపైకి వెళ్ళిపోయా. అతను, అతని భార్య కింది బెర్తులు రెండూ ఆక్రమించుకొని హాయిగా పడుకున్నారు. కాసేపటికే అతడి గురక శబ్దం వినిపిస్తూంటే, 'ఆహా! ఎంత హాయిగా, ప్రశాంతంగా, నిశ్చింతగా నిద్రపోతున్నాడితను! నాకు ఏ.సి రూమ్‌లో కూడా ఇంతమంచి నిద్ర రాదే' అని నిట్టూరుస్తూ దుప్పటి తలవరకూ కప్పుకొని నేనూ నిద్రపోయే ప్రయత్నంలో పడిపోయా.

బయట వర్షం పడుతున్నట్లుంది. కిటికీల గుండా చల్లని గాలి లోపలికి వస్తోంది. మర్నాడు చేయాల్సిన కార్యక్రమాల గురించి ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రలోకి జారుకున్నానో తెలీదుగానీ నాలుగింటికి మెలకువ వచ్చేసింది.

బండి ఆగి ఉంది. బయట కుండపోతగా వర్షం పడుతోంది. ఏ స్టేషనో అనుకుంటూ బెర్తు దిగివచ్చి కిటికీ అద్దం గుండా చూశా కానీ, చీకటి తప్ప నాకేం కనిపించలా. కింద బెర్తుల్లో అందరూ ఇదేం పట్టనట్లు ప్రశాంతంగా నిద్రపోతున్నారు. నేనూ మళ్ళీ నిద్రపోవడానికి ప్రయత్నించా.

కంపార్ట్‌మెంట్‌లో కోలాహలానికి ఆరింటికి మెలకువ వచ్చేసింది. తిరుపతి దరిదాపుల్లోకి వచ్చేసి ఉంటాం అనుకుంటూ కిందికి దిగివచ్చా. ఆశ్చర్యం! బండి కదలకుండా మెదలకుండా, ఉలక్కుండా పలక్కుండా రాయిలా పడుంది. కిటికీ గుండా చూద్దును కదా చుట్టూ నీళ్ళు! ఇంకా వర్షం కురుస్తూనే ఉంది. ట్రాక్ బాగా పాడయిందనీ, రిపేరు అయ్యేసరికి కనీసం నాలుగు గంటలన్నా పడుతుందనీ తాజావార్త! తీరా చూస్తే నగం దూరం అన్నా దాటలా. ఇంకా ఎన్నో మైళ్ళు ప్రయాణం చేస్తే కానీ తిరుపతికి చేరం.

ఉసూరుమంటూ నీటివేపు చూస్తూ సీట్లో కూలబడ్డా. అప్పటికే ఎదుటి సీట్లోని రైతు, అతని భార్య మధ్య బెర్తుని కిందికి దింపేసి, నింపాదిగా కూర్చొని బయట కురుస్తున్న వర్షాన్ని చూస్తున్నారు. ఎదుటి బెర్తుల్లో పిల్లలు ఇంకా నిద్రపోతూనే ఉన్నారు. ఓ గంట గడిచాక అప్పటికి తీరిగ్గా లేచారు వాళ్ళు. మళ్ళీ అరుపులు, కొట్లాటలు, ఏడుపులు, ఆటలు- అన్నీ మొదలు! నాకైతే ముళ్ళపై కూర్చున్నట్లు అనిపిస్తూంటే, ఏం చేయలేక కళ్ళు మూసుకొని కూర్చుండిపోయా కాసేపు.

అలా ఎంతసేపు ఉండేవాణ్ణో గానీ, ఎదుటి సీట్లోని పిల్లవాడొకడు ఆరున్నొక్క రాగంతో ఏడుపు లంకించుకునేసరికి కళ్ళు తెరవక తప్పలా.

పళ్ళు తోముకోకుండా టిఫిన్ తింటానంటాడు వాడు. పళ్ళు తోమందే టిఫిన్ పెట్టనంటుంది వాడి తల్లి. ఇక వాడు ఏడవడం, ఆమె విసిగిపోయి వాణ్ణి రెండు తగల్నిచ్చి, బాత్‌రూమ్ వైపు ఈడ్చుకు పోవడం జరిగింది. ఆరేళ్ళ పాప నా పక్కన కూర్చొని కళ్ళు నులుముకుంటూ దిక్కులు చూస్తోంది.

చుట్టూ నీళ్ళు! కంటి చూపు ఆనినంతదూరం నీళ్ళు! నీళ్ళ మధ్యలో బండి! బండిలోకి కొంచెం కొంచెం తొంగిచూస్తున్న నీళ్ళు! పన్నెండేళ్ళ పిల్లవాడికి అదంతా చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది కాబోలు కాగితంతో పడవలు చేసి నీళ్ళలోకి వదులుతూ, ఉత్సాహంగా ఆడుకుంటున్నాడు. ఆ రైతు మాత్రం ముఖంపై ఎలాంటి భావాలూ కనబరచకుండా, ఒక మహా యోగిలా నీళ్ళల్లోకి చూస్తూ కూర్చుండిపోయాడు.

టైమ్ చూద్దును కదా ఎనిమిది దాటుతోంది. క్రితం రాత్రి పస్తు ఉండడంతో ఆకలి నెమ్మది నెమ్మదిగా తన ప్రకోపం చూపించడం మొదలు పెట్టింది. దానికి తోడు ఉదయం కాసిని కాఫీనీళ్ళన్నా గొంతులో పడలేదు. బయలు దేరిన వేళావిశేషం బాగున్నట్లు లేదు. 'ఈ లెక్కన ఈ బండి తిరుపతి చేరేదెప్పుడు? నేను దేవుడి దర్శనం చేసుకొని బయట పడేదెప్పుడు? తిరిగి మా ఊరికి చేరుకునేదెప్పుడు?' అనుకుంటూ వెంట తెచ్చుకున్న మ్యాగజైన్ పేజీలు తిరగేస్తూ కూర్చున్నా.

మళ్ళీ అరిటాకులు పరచు కోవడం, బిలబిలమంటూ పిల్లమూక అరుపులు, కేకల మధ్య పులిహోర, ఆవడలు లాగించడం జరిగిపోతోంది యథావిధిగా. మళ్ళీ సీట్లపైన ఇంత, కింద ఇంత యథేచ్ఛగా పోస్తూ, బయట ప్రపంచంతో తమకేం సంబంధం లేదన్నట్లు నిశ్చింతగా తమ పనిలో లీనమై పోయారు. నాకైతే అరికాలి మంట నెత్తికెక్కుతోంది వాళ్ళనలా చూస్తుంటే. 'పొందికగా తినడం, శుచీ శుభ్రంగా ఉండడం చేతగానివాళ్ళు ఎందుకు ఎక్కుతారో స్లీపర్ కోచ్‌లలో' అంటూ మళ్ళీ నసపెట్టడం మొదలుపెట్టింది మనసు.

టైమ్ పది దాటింది. అయినా బండి కదిలే సూచనలేం కనబడ్డంలా. ఆకలి తన ఉనికిని తెలియజేస్తూ మరింత మారాం చేయడం మొదలుపెట్టింది.

మ్యాగజైన్‌లోని అక్షరాల స్థానంలో ఇడ్లీ, దోసె, కారప్పొడి, కొబ్బరి చట్నీ లాంటివి సాక్షాత్కారం ఇవ్వడం మొదలుపెట్టాయి. కాసేపటికి ఎదుటి సీట్లోని పిల్లలు చిరు తిండికి మారాం చేస్తున్నారు. కంపార్టుమెంటులో కట్టిపడేసినట్లుందేమో, తిండి తప్ప మరో కాలక్షేపం దొరకలేదు వాళ్ళకు. కొంచెం విసుక్కుంటూనే స్టీలు డబ్బాలోంచి ఏవేవో తీసి అందిస్తోంది ఆ ఇల్లాలు.


"బాబుగారూ" అన్న పిలుపుకి మ్యాగజైన్ లోంచి తలెత్తి ఎదుటి సీటువైపు చూశా.

"ఇయి... ఇయి తీసుకోండి" అంటూ రెండు అరిసెలు, ఒక పూతరేకు, కొంచెం కారప్పూస ఒక పళ్ళెంలో పోసి అందించబోయాడు ఎదుటి సీట్లోని

రైతు.

ఓపక్క ఆకలిగా ఉన్నా అతడు తీసుకుంటున్న అతి చొరవకి ఒళ్ళు మండింది నాకు. వాటిని పురుగుల్ని చూసినట్లు చూసి, "వద్దయ్యా" అన్నా విదిలించికొడుతూ.

"శానా పొద్దెక్కింది బాబూ! ఈ బండి సిగదరగ, ఇదెప్పుడు కదులుద్దో ఏవోఁ? పొద్దున్న లగాయతు తమరేం తీసుకోలా... అందుకని..." అన్నాడతను కొంచెం నొచ్చుకుంటూ.


చిత్రాలు: నర్సిం

వద్దని నేను సైగ చేయడంతో పిల్లలు తలా ఒకటి లాక్కొని తినడం ప్రారంభించారు. 'ఇతనెక్కడ, నేనెక్కడ? పైగా ఏం కులమో ఏమో? నాకు అందిస్తున్నాడు తినమని... వీడి ధైర్యానికి మెచ్చుకోవచ్చు...' అనుకున్నా కోపంగా తల తిప్పేసుకుని, కిటికీ గుండా నీళ్ళల్లోకి చూస్తూ.

మరో గంట తరువాత బండి నెమ్మదిగా బయలుదేరింది. నాకైతే ప్రాణం లేచివచ్చినట్లు అనిపించింది. 'బండి ఏదైనా స్టేషనులో ఆగంగానే ముందు ఒక నీళ్ళ బాటిలు, రెండు బిస్కెట్ ప్యాకెట్లన్నా సంపాదించాలి' అనుకున్నా పర్సులోంచి కొంచెం డబ్బు తీసి విడిగా జేబులో పెట్టుకుంటూ.

ఎప్పటికో ఒక స్టేషనులో ఆగింది బండి. జనం ఒక ప్రవాహంలా స్టేషనంతా నిండిపోయి, దొరికిందంతా కొనుక్కుంటున్నారు హడావిడిగా. ఆ తొక్కిసలాటలో కనీసం రెండు అరటిపళ్ళన్నా సంపాదించలేని నేను ముఖం గంటు పెట్టుకుని సీట్లోకొచ్చి కూర్చున్నా. అంతా అయోమయం. బండి ఎక్కడ, ఎప్పుడు, ఎంతసేపు ఆగుతుందో ఎవరికీ తెలియదు. గమ్యం ఎన్నింటికి చేరుస్తుందో అసలే తెలియదు. ఆ కంగారులో ప్రతి వస్తువు కోసం ఒకటే కుమ్ములాట! బండి ఆగిన ప్రతి స్టేషన్‌లోనూ ఇదే పోరాటం, ఇదే తంతు! ఏదైనా కొనుక్కునే నేపథ్యంలో ఎక్కడ కాళ్ళూ చేతులూ విరగ్గొట్టించుకుంటానో అని భయపడి, మరిక అలాంటి ప్రయత్నం విరమించుకున్నా.

మధ్యాహ్నం రెండు దాటింది. బండి ఎక్కడెక్కడో ఆగుతోంది. ఆగిన ప్రతిచోటా గంటో గంటన్నరో నిలిచిపోతోంది. ఒకసారి ఆలస్యం అయిందంటే ఇకమరి ఆ బండి గతి అంతే. గమ్యం చేరేవరకూ ఆగుతూ, ఆగుతూనే పోతుంది. ఆలస్యంగానే చేరుతుంది. తప్పదు. ఒకసారి బండి ఎక్కాక అది గమ్యం చేర్చేవరకు ఇష్టం ఉన్నా లేకపోయినా అందులో కూలబడక తప్పదు. రోట్లో తల దూర్చాక రోకటి పోటుకు తట్టుకోక తప్పదు!

ఉదయం నుంచి పచ్చి మంచినీళ్ళన్నా తాగలేదేమో శోష వచ్చేటట్లుంది. తల గిర్రున తిరుగుతోంది. కాళ్ళు, కళ్ళు తేలిపోతున్నాయి. ఆకలి వల్ల కడుపులో పేగులు మెలేసినట్లు బాధ! అది చాలదన్నట్లు ఆ రైతు జాలిచూపులు! వీటన్నింటినీ తట్టుకోలేక కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి గానీ బలవంతంగా ఆపుకొని, ఆటల్లో లీనమైన పిల్లలవైపు చూస్తూ కూర్చుండిపోయా.

కాసేపయ్యాక అతడు మళ్ళీ తన ధోరణిలో నాకు నచ్చజెప్పడం మొదలుపెట్టాడు. "బాబుగారూ. కూతంత ఎంగిలి పడండి. మీరు పెద్దోరు. సదూకున్నవోరు. మీకు సెప్పేంతటోణ్ణి కాదుగానీ, ఇలా ఇంతసేపు ఆకలితో ఉంటం మంచిది కాదయ్యా..." అన్నాడు ఎంతో బుజ్జగిస్తూ.

ఒక కొడుకు పట్ల ఒక తండ్రికుండే లాలన ఉంది ఆ బుజ్జగింపులో. ఆ తీరులో అర్థింపు ఉంది. ఆర్ద్రత ఉంది. ఆప్యాయత ఉంది. ఆవేదన ఉంది. అప్పటి నా పరిస్థితి ఎలా ఉందంటే అమృతం, అన్నం- రెండూ నా ముందుంచి, 'నీకేది కావాలీ' అని అడిగితే "అన్నం" అని కచ్చితంగా చెప్పగలను కానీ, మనసులో ఏదో వెరపు, ఏదో సంకోచం, సంఘర్షణ. తరతరాలుగా మనసులో జీర్ణించుకుపోయిన మూఢభావాల అడ్డుగోడలు... మరింత కుంచించుకుపోయిన సంకుచిత భావాలు... కులం, గోత్రం, భాష, ప్రాంతం అంటూ మనం ఏర్పరచుకున్న ముళ్ళ కంచెలు... తలా తోకా లేని తారతమ్యాలు! అలాంటి విషవలయంలో చిక్కుకున్న నాకు ఒక విశాల మైదానంలోకి అడుగు పెట్టాలంటే అది విషమ సమస్యే మరి!

"వద్దయ్యా" అని నిక్కచ్చిగా చెప్పేసి ముభావంగా ఎటో చూస్తూ కూర్చుండిపోయా, చిన్నబోయిన అతడి ముఖంలోకి చూసే ధైర్యం లేక.

చూస్తూ చూస్తూనే సాయంత్రం అయింది. బండిని మరో గంట ఏవో పొలాల మధ్య కూలేసి, మళ్ళీ నెమ్మదిగా కదిలించాడు డ్రయివరు. పాపం అతను మాత్రం ఏం చేస్తాడు? పరిస్థితుల్ని అనుసరించి ప్రవర్తించే ఒక నిమిత్తమాత్రుడు అతను. రాత్రి ఎనిమిదింటికి బండి మరో స్టేషన్‌లో ఆగడం, ఉప్పెనలా ప్రయాణికులంతా స్టేషన్‌ని కబళించడం, ఆహారపదార్థాల కోసం, నీళ్ళకోసం తొక్కిసలాడడం, బండి కూత వింటూనే మళ్ళీ కంపార్టుమెంట్లలోకి వచ్చిపడడం, ఏదన్నా కొనుక్కోవాలన్న నా తపన మళ్ళీ విఫలమవడం- అన్నీ చకచకా జరిగిపోయాయి. 'ఈ బండి తిరుపతి చేరేదెప్పుడో?' అనుకుంటూ నిస్సారంగా సీట్లో కూలబడ్డా.

చాలా సంవత్సరాల క్రితం ఒక పెద్ద కరవు వచ్చిందట. మనుషులు ఏదిపడితే అది తిన్నారట. ఆఖరికి ఒకర్నొకరు పీక్కుతినడానికి కూడా వెనుకాడలేదట. మరో రోజు ఈ బండిలో ఉంటే అలాంటి కరవు ఏదో చవిచూడాల్సి వచ్చేటట్లుంది!


పిల్లలు గోల చేస్తుంటే డబ్బాల్లోంచి మళ్ళీ ఏవేవో తినుబండారాలు తీస్తోంది రైతు భార్య. క్రితం రాత్రి, ఉదయం, మధ్యాహ్నం వికారం, వినుగుదల కలిగించిన ఆ వస్తువులన్నీ ఎవరో ఏదో మంత్రం వేసినట్లు అమృతతుల్యంగా కనిపించాయి. బహుశా ఆకలి మహిమ కాబోలు!

**"బాబుగారూ. కూతంత ఎంగిలి పడండి.**
**ఇలా ఇంతసేపు ఆకలితో ఉంటం మంచిది**
**కాదయ్యా" అన్నాడు బుజ్జగిస్తూ.**

"బాబుగారూ" మళ్ళీ పిలిచాడు నా 'గాడ్ ఫాదర్'. ఈ సారి ఆ పిలుపులో అర్థింపు లేదు. ఆజ్ఞ ఉంది. అభ్యర్థన లేదు. అధికారం ఉంది. పళ్ళెం అందిస్తూ "ఊఁ తీసుకోండి" అన్నాడు శాసిస్తున్నట్లు.

"పొద్దుట్నించీ చూస్తన్నా నీ యవ్వారం. కూత్తంత ఏదన్నా తినయ్యా అంటే వద్దంటూ బుర్ర ఆడించేత్తన్నావ్. ఆకల్తో అన్నేయంగా నచ్చిపోతావయ్యా.





తినవయ్యా బాబూ తిను! నుచి నుబ్బుడాలు మాకూ ఉన్నయ్యిలే" అంటూ ఒక్క కసురు కసిరాడు.

ఆ కంఠంలోని మాహాత్మ్యమో, నా ఆకలి ప్రకోపమో గానీ గబుక్కున ప్లేటు చేతిలోకి తీసుకొని గబగబా తినడం మొదలుపెట్టా. నాకు ఊహ తెలిశాక అంత రుచికరమైన తినుబండారా లెప్పుడూ తిన్న జ్ఞాపకం లేదు. చిన్నప్పటి నుంచి ఆకలి అంటే ఏమిటో తెలియకుండా పెరిగిన వ్యక్తిని! నా వైపు చూస్తున్న ఆ భార్యాభర్తా కళ్ళల్లో తొణికిసలాడుతున్న ఆనందం, తృప్తి చూస్తుంటే నా కళ్ళల్లో కన్నీళ్ళు తొంగి చూశాయి. చేయి కడుక్కుని వచ్చి వాళ్ళు అందించిన మంచినీళ్ళు తాగి, థ్యాంక్సు చెప్పి పైన బెర్తుపైకొచ్చి నడుం వాల్చా. రోజంతా ఆకలితో పోరాడిన శరీరం అలనటతో సొమ్మసిల్లి పడిపోయింది.

మర్నాడు ఉదయం ఏడింటికి బండి తిరుపతి చేరాక, కింది వాళ్ళు నిద్రలేపితే కానీ మెలకువ రాలేదు నాకు. మరోసారి వాళ్ళకు కృతజ్ఞతలు చెప్పి, కొండకు వెళ్ళే బస్సుల కోనం క్యూలో నిల్చొనే ఓపిక లేక ట్యాక్సీ ఎక్కేశాను బతుకుజీవుడా అనుకుంటూ. ఏలాగో తంటాలు పడి ఒక కాటేజి నంపాదించి, తలనీలాలు నమర్పించి, స్పెషల్ టికెట్ కొనుక్కుని గుడిలోకి అడుగుపెట్టా. అదృష్టవశాత్తూ త్వరగానే దర్శనం అయింది. తరువాత దగ్గర్లో ఏదో హోటల్లో భోంచేసి, కాటేజికి వెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకొని, మధ్యాహ్నం నాలుగింటికంతా బస్టాండులో టికెట్ కొనుక్కొని, ఆరింటికంతా తిరుపతి స్టేషన్‌లోకొచ్చిపడ్డా. టీసీకి కొంత ముడుపు చెల్లించుకుని ఎలాగోలా ఒక బెర్తు నంపాదించగలిగా.

ఓ అరడజను అరటిపళ్ళు కొనుక్కుంటూ పక్కకి తిరిగి చూద్దును కదా నా ఆకలి తీర్చిన ఆసామీ నవ్వుతూ నిలబడి ఉన్నాడు. ఎందుకో విపరీతంగా నంబరపడి పోతున్నాడు. ముఖం ట్యూబ్‌లైటులా వెలిగి పోతోంది.

"ఎంకన్న దర్శనెం బాగా అయ్యిందా బాబయ్యా" అన్నాడు జేబులోంచి ఏదో ఒక పొట్లాం బయటికి తీస్తూ.

"ఆఁ బాగానే జరిగింది. మరి మీకో" అన్నా ఆసక్తిగా, అతడి చేతిలోని పొట్లాం వేపు చూస్తూ.

"మాకూ ఆ దేవుడి దయవల్ల బాగానే జరిగింది బాబూ. దరమ దర్శినెం గదా, కూత్తంత లేటయిందంతే" అన్నాడు పొట్లం నా చేతిలో ఉంచుతూ.

"ఏమిటి" అన్నా అయోమయంగా అతడికేసి, పొట్లంకేసీ చూస్తూ. భళ్ళున నవ్వేశాడతను.

"నువ్ పోగొట్టుకున్నదేందో కూడా నీకు తెలీలేదు గందా పిచ్చిమారాజా" అన్నాడు వాత్సల్యంగా చూస్తూ.

గబగబా పొట్లం విప్పి చూద్దును గదా నా మెడలో ఉండాల్సిన బంగారం గొలుసు! ప్రయాణం కలిగించిన ప్రయాస నన్ను పరధ్యానంలో ముంచేసింది. అందుకే అది పోయిందన్న విషయం కూడా గమనించలేకపోయాను అప్పటివరకూ!

"ఎక్కడ దొరికిందీ" అన్నా ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ.

"ఇంకెక్కడా? పెట్లోనే! నా భార్య సూనిందట దీన్ని మీ మెళ్ళో మీదే అని కచ్చితంగా సెప్పింది. మీకోసం ఎతుకుదుం గదా, మీరెల్లిపోతిరి. లడ్డూలమ్మే క్యూ దగ్గిర సూశాంగానీ శిటికలో ఎల్లిపోతిరి లడ్డూలన్నా కొనకుండా! నే లగెత్తుకొచ్చేతలికే మీరు జనంలో కల్సిపోతిరి. కబడకుండా పోతిరి. పోనీలే, ఆ ఎంకన్న దయవల్ల ఈడన్నా అగుపించారు" అన్నాడు ఎంతో సంబరపడిపోతూ. నా సంతోషం కంటే రెట్టింపుగా ఉంది అతడి ఆనందం.

"మీరూ ఈ బండికే వస్తున్నారా" అన్నా ఉత్సాహంగా చూస్తూ.

"అవునయ్యా! ఇయ్యాళెలాగన్నా ఎల్లిపోవాలి. ఎవసాయం వన్లు పీకల్దాకా ఉన్నయ్యి. ఎల్లక తప్పదు. పైగా ఈ వరదొచ్చిందా... వంటంతా పాడయ్యే ఉంటుంది. మావోళ్ళు... అదో... ఆడ కూకున్నారు జనరలు పెట్టిలో. ఇంతమందిమి గదయ్యా... ఇప్పటికిప్పుడు అనేతలికి సీవర్లో సోటు దొరకలా" అన్నాడు తేలిగ్గా నవ్వేస్తూ.

మనసు చివుక్కుమనిపించింది. గిల్టీగా కూడా అనిపించింది. ఇంతలో అతడు ఏదో గుర్తొచ్చినట్లు తనవాళ్ళ దగ్గరకెళ్ళి రెండు లడ్డూలు చేత్తో పట్టుకొచ్చాడు.

"ఇందయ్యా. ఇయి అట్టుకెల్లు. నే జూశా. నువ్ నిలబడలేక లడ్డూలు కొనకండానే ఎల్లిపోయావు" అన్నాడు ప్రసాదం ఎంతో భక్తిపూర్వకంగా నాచేతిలో ఉంచుతూ.

తటపటాయిస్తున్న నావైపు చూస్తూ- "ఏడు కొండలవాడి పెసాదం గదా బాబూ... దీనికేం అంటూ సొంటూ ఉండదయ్యా! తీసుకో..." అన్నాడు నచ్చజెబుతున్న ధోరణిలో.

డబ్బు ఇవ్వబోతే సున్నితంగా తిరస్కరించాడు.

'ఇలాంటివాడినా తాను నంస్కార హీనుడు అనుకుంది' అనుకున్నా విస్తుబోయి చూస్తూ. ఎవరో చెంపమీద చెళ్ళున కొట్టినట్లు అనిపించింది. అతడి ఒంటిమీద ఉన్నవి నీరుకావి పంచె, ముతకనూలు చొక్కా అయినా, అతని మనసులో ఉన్న ఉన్నత భావాలు, విశాలదృక్పథం, మానవత్వపు విలువల ముందు నా ఖరీదైన దుస్తులు, నా ఖరీదైన డిగ్రీలు, ఇంకా ఖరీదైన నా హోదాలు అవీ ఏ పాటి విలువ చేస్తాయి అనిపించింది. అరక్షణం క్రితంవరకూ అండగా నిలిచే ఆశయాలెన్నో దోసిలి లోని నీళ్ళలాగా కిందికి జారి "ప్రాక్టికల్" ఆలోచనల నేలలో ఇంకిపోతాయి ఈ యాంత్రిక యుగంలో! ఇలాంటి వాతావరణంలో ఇన్ని అరుదైన మంచి భావాలున్న ఈ వ్యక్తి మామూలు మనిషెలా అవుతాడు అనిపించింది. 'నా శారీరకమైన ఆకలినే కాకుండా మానసికమైన ఆకలిని కూడా తీర్చిన మహానుభావుడు. నా కళ్ళు తెరిపించిన మహనీయుడు' అనుకున్నా అతడికి మనసులోనే నమస్కరిస్తూ.

మానవత్వపు విలువలు పరిమళించాలంటే మనిషి మనసులో ముందు మమత వెల్లివిరియాలి. మమకారం వెల్లువై పొంగాలి. చైతన్యం వెన్నెలై కురవాలి. నిజాయితీ నీడలా నిలవాలి. ఇవన్నీ అతడిలో పుష్కలంగా కనిపించాయ్. అతడి స్వచ్ఛమైన నంస్కారపు వెలుగులో నా నంకుచిత భావాలన్నీ వెలాతెలా పోయాయ్.

"నాకెంత మేలు కలిగించావయ్యా... " అన్నా కళ్ళల్లో తిరుగుతున్న నీళ్ళకు ఆనకట్ట వేయడానికి ప్రయత్నిస్తూ.

"ఓసోసి, ఇదోపాటి మేలేటి బాబయ్యా! మనిషిని గందా... ఈ పాటి సేయలేకపోతే ఇక బతుక్కి ఇలువేందయ్యా" అంటూ వేదాంతిలా నవ్వేశాడు.

చేతిలోని ప్రసాదం కళ్ళకద్దుకుంటూ, "బండి

**'నా శారీరకమైన ఆకలినీ, మానసికమైన ఆకలిని కూడా తీర్చిన మహానుభావుడు. నా కళ్ళు తెరిపించిన మహనీయుడు.'**

బయలుదేరేటట్లుంది. నువ్వీక వెళ్ళి కంపార్టుమెంటులో కూర్చుంటే నయమయ్యా" అన్నా ప్రేమపూర్వకంగా అతని భుజంపై చేయి వేసి.

నా అసలు ఉద్దేశం అతడిని అక్కడ నుంచి త్వరగా సాగనంపాలనీ, తన్నుకొస్తున్న కన్నీటిని అతడి కంట పడనీయగూడదనీ! ఒక్కోసారి మన ఎమోషన్స్‌ని ఇతరుల ముందు దాచాలంటే కష్టం. కానీ, ఒక్కోసారి వాటిని వాళ్ళముందు బయట పెట్టాలంటే అది మరింత కష్టం మరి! ■